# ఏతే గృహభారకాః

- ఎమ్.కె. అమర్‌నాథ్



నేను ఊరు నుంచి తిరిగొచ్చా నని తెలియగానే మా అమ్మగారు నన్ను ఆమె పడుకున్న గదిలోకి పిలిచి అడిగారు - "ఏరా! సూర్యనారాయణగారు కనబడ్డారా? గుర్తు పట్టారా? వస్తా నన్నారా?" అని.

నన్ను కాళ్ళు కడ్డుక్కోనీయకుండా ఆవిడ గదిలోకి పిలిచి సూర్యనారాయణ గారి గుర్చి వాకబు చేసిన తీరు మా ఆవిడకి కొంచెం చికాకు తెప్పించింది గానీ, నేను కొడుకును కాబట్టీ ఆయన పట్ల ఆమెకున్న భక్తీ శ్రద్ధా, గౌరవమూ తెలిసున్నవాణ్ణీ కాబట్టీ - "కనబడ్డారమ్మా! మాట్లాడే వచ్చాను!" అన్నాను నా జవాబు నగంలోనే తుంచేసుకుంటూ.

"వస్తా నన్నారా?"

ఊహు! లాభం లేకపోయింది. ఆవిడకు చెప్పకూడని విషయాన్ని అమాయకంగా గుచ్చి గుచ్చి అడుగుతోంది. అందుకే అప్రయత్నంగా నా నోట నే సిద్ధపరచుకున్న అబద్ధం వచ్చేసింది.

"రాలేరమ్మా! ఆయనకి ఒంట్లో నరిలేదు. మంచం మీ దున్నారు." ఈ మాటతో ఆయన రాక మీద ఆమెకున్న ఆత్రతల్లా జాలిలోకి మారిపోయింది.

"అయ్యో పాపం! ఏవిట్టి?"

"తర్వాత వచ్చి చెప్తానమ్మా! ముందు స్నానం, భోజనం కానీ ..." అని మా ఆవిడ చురుకు చూపుల్ని దాటుకుంటూ గుమ్మం అవతల పడ్డాను.

ఈ భారతదేశంలో చాలామంది భార్యలు పతివ్రతలే కానీ, ఆ పాతివ్రత్యం తమ నహనానికి పరీక్ష పెట్టనంత వరకే. ఊరునుంచి దిగగానే ఆ రెండు చెంబులూ ఒంపుకుని, ఆ రెండు మెతుకులూ కొరికేసి, తన మానాన తనని వంటిల్లు మూసేసి, లైటార్పి పడుకోనిస్తే ఆ పైన ఇహ మా అమ్మగారితో ఎంత రాత్రివరకు కబుర్లు చెప్పుకున్నా అభ్యంతరం ఉండదు మా ఆవిడకి. అందుకే కదిలిస్తే కందిరీగ పుట్టలాగా ఎక్కడ కబుర్లు చెప్తానో అని తనూ మౌనంగా అన్నం పెట్టీ, అవనరాలని తీర్చి తన మానాన తను నిద్దర్లోకి జారుకుంది.

ప్రయాణం బడలిక మీద ఆ గదిలో పడుకోవడం చికా కనిపించి, ఆమెను లేపి తలుపు గడియ పెట్టుకోమని చెప్పి చాపా, దిండూ తీసుకుని డాబామీదకి చేరాను.

ఆకాశానికి వెల్లకిలా వెన్ను వాల్చగానే మేనికి సోకిన చల్లగాలి సగం బడలికని దూరం చేసింది.

మనసులోకి మళ్ళీ సూర్యనారాయణగారు వచ్చి నిలిచారు. సూర్యనారాయణ గా రెవరంటే మా తాతల నాటి నుంచి మా ఇళ్ళలో పౌరోహిత్యం నెరిపే శాస్త్రిగారు.

ఆయనలో ఒక పవిత్రత ఉందనీ, ఆయన వాక్శుద్ధి అమోఘమనీ, ఆయన ఆశీర్వచనం, హస్తవాసి అమోఘమనీ, ఆయన ఉండే ఊళ్ళో ... అదే ... మా తాతగారి ఊళ్ళో కొంతమంది విశ్వాసం. అందుకే ఏ పుణ్యకార్యమైనా వారి చేతులమీదుగా జరగాలని అందరూ కోరుకుంటారు. మా ఇంట్లో గూడా మా నాన్నగారి పెళ్ళి మొదలు, నా బారసాల, ఉపనయనం, నా పెళ్ళి కూడా వారి చేతులమీదుగా జరిగినవే.

అంతే కాదు. నా పిల్లల బారసాలలు కూడా ఆయన చేతులమీదుగానే జరిగాయి. మా ఆవిడ పురుళ్ళు మా ఇంట్లో జరగడం మొదలయ్యాక ఉద్యోగరీత్యా నేను ఊళ్ళు తిరగడం మొదలెట్టాక సూర్యనారాయణగారు నా స్మృతిపథంలో కొద్దిగా కనుమరుగైనా, మా అమ్మగారి మనోఫలకం మీద ఇంకా అలాగే ఉన్నారు. మా ఇంట్లో ఏ మామిడాకు తోరణం కట్టినా 'సూర్యనారాయణగా రుంటే బావుండేది కదా ఈ సమయంలో అని అనుకోవడం మా అమ్మగారికి ఆనవాయితీ. దానికి నా కనిపించే మరో ముఖ్యమైన కారణం - ఆ రోజుల్లో ... అంటే దాదాపు యాభై, అరవయ్యేళ్ళ క్రితం మనుమల్లో ధర్మచింతనా, ధర్మ కార్యాల పట్ల, పుణ్యకార్యాలపట్ల ఆసక్తీ మెండుగా ఉండేవి. అందుచేత వాటి ప్రతినిధులుగా ఉండే పూజార్లకూ, పురోహితులుగా ఉండేవారి పట్ల కూడా ఆ రోజుల్లో వారికి కొంచెం భక్తి ప్రపత్తులు ఎక్కువగానే ఉండేవి. హుఁ! ఈ రోజుల్లో అంతటి విలువ లిచ్చే వా రేరీ? ఆ ఇచ్చిన విలువలు నిలుపుకునే అర్హత గల వా రేరీ?

ఇంతకీ విషయ మేమిటంటే ... నే నీ మధ్యనే కాస్త కాలూ, చెయ్యీ కూడదీసుకుని ఓ ఇల్లు కట్టాను. దాని గృహ ప్రవేశానికి సూర్యనారాయణగా రుంటే బాగుండునని మా అమ్మగారి కోరిక.

"నేనే పెద్ద దా న్నయ్యాను. వా రింకా పెద్దవారై ఉంటారు. ఒకసారి ఆ పెద్ద చేత్తో రెం డక్షింతలు వేయించుకుంటే వంశానికి మంచిది."

ఇదీ ఆవిడ కోరిక.

సరే, కానీలే అని చెప్పి ఆవిణ్ణి చిన్నబుచ్చడం ఇష్టం లేక ఆయన్ని సకల మర్యాదలతోనూ, ఖర్చులన్నీ భరించి తీసుకురావడానికి వెళ్ళాను. సరాసరి వా ళ్ళింటికే వెళ్ళాను. కానీ ఆయన అక్కడ లేరని తెలిసింది. వాళ్ళ అమ్మాయిగారింట్లో ఉంటున్నా రని తెలిసింది. అక్కడికీ వెళ్లాను. ఆయన ఉన్నా రక్కడ. పెద్దవా రయ్యారు కాబట్టీ, కొంచెం గుర్తుపట్టడం

> **అసలువాడు**
>
> మొదటావిడ: నా ముగ్గురు కొడుకులూ చాలా సఖ్యంగా ఉంటారు. ఎవరైనా ఒకడు తప్పు చేస్తే మిగతావాళ్ళు దాన్ని చస్తే బయట పెట్టరు.
>
> రెండో ఆవిడ: [విస్మయంగా] మరి తప్పు చేసిం దెవరో ఎలా కనుక్కోవడం?
>
> మొదటావిడ: అఁ ఏముంది? ఆ రోజు రాత్రి ముగ్గురికీ భోజనం లేకుండా చేస్తే మర్నాడు పొద్దున ఒకడు కమిలిపోయిన దెబ్బలతో మంచం దిగుతాడు.
>
> - జి. వైశాలి [సికింద్రాబాదు]

కష్టమైంది. ఆయనకి మరీ కష్టమైంది నన్ను గుర్తుపట్టడం.

గుర్తుపట్టాక ఆయనకి ఏనుగెక్కినంత సంతోషం వేసింది ఇంకా తనని గుర్తుంచుకుని వెతుక్కుంటూ వచ్చినందుకు. కుశల ప్రశ్నలూ, కాఫీ టిఫిన్లు అయ్యాక నే నొచ్చిన పని గురించి చెప్పాను. నా ఇంటి గృహ ప్రవేశం ఆయన చేతుల మీదుగా జరగడం మా అమ్మగారి మనోకామనగా చెప్పాను.

ఈ ముక్క వినగానే ఆయన మొహం ఎందుకో చిన్నబోయింది. వివర్ణమైంది. విషణ్ణ వదనంతో పూడుకుపోయిన గొంతుతో ఆయనకు మాట పెగల్లేదు.

ఎట్లాగో తేరుకుని - "నాకు వీ ల్లేదు బాబూ! నేను రాలేను" అన్నారు.

హఠాత్తుగా వాతావరణంలో వచ్చిన మార్పు నాకు మింగుడు పడలేదు. 'ఎందువలన?' అని అడిగి ఆయన నుంచి జవాబు రాబట్టడానికి ప్రయత్నించవచ్చు. కానీ అది సంస్కారం అనిపించుకోదు. ఆయన ఏదో విషయంలో దెబ్బతిని బాధపడుతున్నట్టున్నారు. ఇక ఆయన్ని ఎక్కువ కదిలించడం మంచిది కాదు. కాసేపు కూర్చుని ఆమాటా, ఈ మాటా మాట్లాడి వస్తా నంటూ లేచి వచ్చేశాను.

రోడ్డు మీద నడుస్తున్నా నన్న మాటే కానీ, అంతటి తేజోమూర్తి మొహంలోనూ ఆ విషాద చ్ఛాయలే నన్ను వెంటాడసాగాయి. ఆ ఊళ్ళోనే ఉన్న నలుగురైదుగురి బంధువుల ఇళ్ళకి వెళ్ళి 'ఇలా నేను ఇల్లు కట్టాను. ఎప్పుడో శుభలేఖ వస్తుంది. మీరంత రావాలి' అని చెప్పడానికి వెళ్ళినప్పుడు మాటల మీద సూర్యనారాయణ గారి గురించి చాలా విషయాలు తెలిశాయి. నే నంటే దూరాన ఉన్నానుగానీ, మా వాళ్ళందరూ ఆ ఊళ్ళోనే ఉన్నారు గదా! వా ళ్ళిళ్ళకి ఈయన వెడుతూనే ఉన్నారు కదా! తనకు కలిగిన కష్టాన్ని ఆ మాటగా, ఈ మాటగా వాళ్ళతో ఆయన చెప్పుకోగా, వాళ్ళకు తెలిసిన విషయా లవి. అవి విన్నాక నా మనసు కూడా కలత చెందింది.

సూర్యనారాయణగారికి ఏడుగురు పిల్లలు. పోయిన వారు పోగా, అంత పెద్ద సంసారాన్ని తన పౌరోహిత్యం మీద మాత్రమే లాక్కొస్తూ, నలుగురిలోనూ పరువుగానే బ్రతికారు. కొడుకులకి మంచి చదువులు చెప్పించి ప్రయోజకుల్ని చేశారు. కూతుళ్ళకి మంచి సంబంధాలనే తెచ్చి చేశారు. అయితే, ఈ లోపు కేవలం ఒక పూరిపాకని మాత్రం ఆయన తన 'స్వగృహం'గా సంపాదించుకోగలిగారు.

రోజులు గడిచాయి. పిల్లల్ని పెద్దవాళ్ళని చేసి, వాళ్ళు రెక్కలొచ్చి ఎక్కడి వారక్కడికి ఎగిరిపోయే సమయానికి ఆయన రెక్కల్లో సత్తువ తగ్గు ముఖం పట్టి దాదాపుగా జీవన ఆకాశంలో అర్థికంగా ఆయన ఎగరలేని పక్షి అయ్యాడు. అందుచేత ఆయన స్వగృహం అనే పాక పూరిపాక స్థాయికి [ఎ]దిగేసరికి, ఇంట్లో సూర్య చంద్రులు కాపురం పెట్టాక పూజాదికాల్లోనూ, త్రి సంధ్యల్లోనూ, సంకల్పాల్లోనూ 'స్వగృహే ...' అని చెప్పుకోడానికి తప్ప ఆ పూరిల్లు వాసయోగ్యం కాని పరిస్థితి కొచ్చేసరికి, అందులో ఉండలేక, వండలేక ఆ మహా ఇల్లాలి కళ్ళు రోజు రోజుకీ శ్రావణ మేఘాలై తడవ తడవకీ ధారాపాతలై కడవలు నింపుతుంటే ఇల్లు బాగుచేయించే విషయం ఆయన కొడుకుల ముందుంచాడు - మీరే



వూనుకుని ఏదైనా చేయాలంటూ!

ఆయన కొడుకులకి రైల్వేలో ఉద్యోగాలు. పెద్ద కొడుకు పై రాష్ట్రాల్లో తిరుగుతుంటాడు. చిన్న కొడుకు ఆయన ఊరికి దగ్గరే. అప్పటికే అతను ఇల్లు కట్టేసుకున్నాడు త నుండే ఊళ్ళో. అతనికి ఇక్కడ ఏమీ ఇంట్రస్టు లేదు. మూడో కొడుకు చిన్నవాడు. పైగా దత్తు కెళ్ళిపోయాడు. అంచేత ఆయన కొడుకు లిద్దర్నీ చేరబిలిచి ఉన్న విషయాన్ని వివరించగానే పెద్దకొడుకు స్థలం మా పేర ఉంటేగానీ మా డిపార్ట్‌మెంట్ లో నివ్వరు ఇల్లు కట్టుకోడానికి అన్నాడు. దాంతో ఆయన 'ఎప్పటికన్నా మీ కిచ్చేదే కదా! ఇప్పుడే తీసుకోండి' అని ఇద్దరికీ చెరిసగంగా ఆ స్థలాన్ని పంపకం చేశాడు. పెద్ద కొడుకు తన భాగంలో ఇల్లు కట్టాడు. పాక పోయి డాబా ఇల్లు వచ్చింది దాని స్థానే. కానీ అక్కడే మొదలైంది అసలు కథ.

పెద్ద కోడలికి తమ కష్టార్జితంతో కట్టుకున్న డాబా ఇంటి మీద నుంచి అద్దె రూపంలో కానీ కూడా రాకుండా కేవలం అత్త మామలూ, విధం చెడి ఇల్లు చేరిన వెధ వాడపడుచుల పరం కావడం కొంచెం కంట గింపు కలిగించింది. నెమ్మదిగా మొగుడి చెవి కొరకడం మొదలెట్టింది.

ఇప్పటికే మనకి నలుగు రాడపిల్లలు. ఇంటి మీద అంత అప్పు పోసి, జీతంలో కటింగు భరిస్తూ, దాని మీద ఏగాణీ అద్దె కూడా సంపాదించకపోతే ఎలా ... ఎలా ... ఎలా? అని. పాపం! ఆ మానవు డేం చేస్తాడూ? ముందు సగ భాగం అద్దె కివ్వడానికి టెండరు పెట్టాడు తలిదండ్రుల దగ్గర.

సూర్యనారాయణ గారు కాస్త ఇల్లు విశాలంగా ఉండా లనుకునే మనిషి. పండగలకీ, పబ్బాలకీ, పురుళ్ళకీ, పుణ్యాలకీ నలుగురూ చేరితే నలభైమందిమి మనమే పోగవుతాం. అద్దె కిచ్చుకుని ఇల్లు ఇరకాటం చేస్కుంటే ఎలా అని ఆయన ఆవేదన పైకి అనలేకపోయారు. సగం ఇల్లు అద్దె కివ్వబడింది. ఆ తర్వాత ఆయన భార్య

### దేనిమీద?

''నేను నిన్న నా వాహనం మీద వెడుతుండగా ఓ ట్రాఫిక్ పోలీస్ అన్నాడు - ఏంటి? హెల్మెట్ ఎందుకు పెట్టుకునావ్? పిచ్చా, లేక బడాయా! అని.''

''అవునూ, నువ్వు మోపెడ్ మీద వెళ్ళావా లేక మోటార్ సైకిల్ మీద వెళ్ళావా? లేక స్కూటర్ మీద వెళ్ళావా?''

''దేని మీదా కాదు, సైకిల్ మీద.''

- నాగమల్లి [కైకలూరు]

కాస్తా దాటిపోయింది. అప్పుడు ఆడబడుచు కాస్తా పరాయిదైపోయింది. అందుకని ఇంకో గది కూడా అద్దె పాలైంది. ఆ తర్వాత ఆడబడుచు నెలా వదిలించుకోవాలో అర్థం కాక ఆయన కోడలు ఇంకో ప్లాను వేసింది.

రెండేళ్ళ కో రాష్ట్రం మారడం మూలాన పిల్లల చదువులు చెడిపోతున్నాయి. పైగా దూరాభారాల్లో ఉంటే పిల్లలకి సంబంధాలు కుదిరి పెళ్ళిళ్ళు కావడం కష్టం అన్న మిష మీద ఒక్కొక్కళ్ళనీ తెచ్చి ఆ ఇంట్లో దించసాగింది. అంతే! కుంపటి పెట్టగానే పొగ మొదలైంది. ఆడబడుచుని పట్టుకుని నా పిల్లని అలా అన్నావుట కదా - ఇలా అన్నావుట కదా అన్న గిల్లి కజ్జాలతో మొదలై ఇంట్లో పడున్నవాళ్ళు ఇంటి యజమానులకి కొంచెం మర్యాద ఇవ్వడం కూడా నేర్చుకోవాలి అనే ముక్తాయింపు వరకూ వెళ్ళింది. ఆడబడుచు అహం సహజంగానే దెబ్బతింది. ఆవిడకీ ఏదో చిన్నం చితకా ఉద్యోగం ఉంది. అందుచేత త నో గదిలో ఉండి అద్దె ఇవ్వడం మొదలెట్టింది.

సహజంగా మడీ, ఆచారాలకి అలవాటుపడ్డ సూర్యనారాయణ గారు రాష్ట్రాలన్నీ చుట్టబెట్టి వచ్చిన ఫార్వర్డ్ జీవనానికి ఎలా సర్దుకోగలరూ? ఆధారం లేని కూతురి పంచన తనకు కూడా ఆధారం లేకుండా చేరక తప్పలేదు. ఈయనకి ఆడదిక్కు లేదు. ఆమెకి మగదిక్కు లేదు. భవిష్యత్తులో ఇలా పెద్దకొడుకు అండ ఉండదనే

కాబోలు పెద్ద కూతుర్ని ముప్పయ్యేళ్ళ ముందుగానే ఆమె పసుపు కుంకమలు చెరిపేసి దేవుడు ఇప్పుడామెను ఆయనకి పెద్ద కొడుకుని చేశాడు.

ఆ తర్వాత క్రమంగానూ, సహజంగానూ పంపు దగ్గరా, బాత్రూముల దగ్గరా కొట్లాటలు అధికమయ్యాయి. వా రిద్దరికీ అక్కడ, ఆ ఇంట్లో ఉండటం దుస్సాధ్యమైంది. అందుచేత ఆమె తల తా కట్టు పెట్టి ఎక్కడో చిన్న ఇల్లు కొనుక్కుని తండ్రిని తీసుకుని వెళ్ళిపోయింది. ఆయన తమ దగ్గర ఉన్నా ఆ మడీ ఆచారానికీ తట్టుకోలేరు కాబట్టి గొంతులో గరళం పడ్డా, కక్కలేకా, మింగలేకా ఊరుకున్నారు పెద్ద కొడుకు, కోడలూను. ఆమెకైతే పీడా విరగడైనందుకు మనసులో చాలా ఆనందం కలిగింది. రాకపోకలు కూడా బాగా తగ్గి పోయాయి శతృత్వాలు పెరగడం మూలాన.


ఇప్పుడు నేను ఊరు వెళ్ళి సూర్యనారాయణగారిని కలిసింది ఆయన కూతురి గా రింట్లోనే.

ఈ పరిస్థితి ఇలా ఉండగా, పక్క ఊర్లోనే ఉన్న రెండో కొడుకు కథ వేరుగా ఉంది. అతను తండ్రి పంచి ఇచ్చిన స్థలంలోని కొబ్బరి చెట్టు తాలూకు కొబ్బరి కాయలు లెక్కపెట్టి మరీ తీసుకువెళతాడట తండ్రి దగ్గర నుంచి. ఆ ఇల్లు వదిలేసరికి ఆ బాధ్యత కూడా వదిలింది అని చెప్పుకుంటారట ఆయన విషాదంగా. సరే! విషయా లిలా ఉండగా ఓ రోజు రెండో కొడుకొచ్చేసి -

'కొడుకులం ఇద్దరం ఉండగా కూతురి దగ్గర ఉన్నారన్న అపఖ్యాతి మా కెందుకు? వచ్చి మా దగ్గ రుండండి. అది మాత్రం మీ ఇల్లు కాదా?' అన్నారట.

సూర్యనారాయణ గారు దూరం ఆలోచించి సరే పద' మన్నారు.

ఆయన జీవితంలో మరో మజిలీ ప్రారంభమైంది.



వెళ్ళిన రెండు మూడు వారాలు మంచి మర్యాదలే జరిగాయి. అక్కడ నుంచి నిరాదరణ ప్రారంభమైంది. పెద్దవాడు పూర్తిగా వదిలేసే బాధ్యత అంత తమ మీద పడుతుం దేమో నన్న భయం · మర్యాదగా వదుల్చుకోవా లన్న రాజకీయం వాళ్ళ ప్రవర్తనలో కనబడసాగాయి.

ఆయన క్రమంగా అర్థం చేసుకున్నారు. విషయాలు విషమించకముందే 'నే నిక్కడ ఉండ లే న్నాయనా! మనూ రెళ్ళిపోత ను' అని నంచి సర్దుకుని మళ్ళీ వెనక్కి వచ్చేశారు.

దాని మూలాన ఆయన రెండో కొడుక్కి అట్టు తండ్రిని పిలిచిన ఖ్యాతి దక్కింది. ఇటు ఆయన ఇమడలేక వచ్చేశారు అన్న నింద మోపడానికి అవకాశమూ చిక్కింది.

ఇప్పుడు సూర్యనారాయణగారి వ్యాపకం ఏమిటంటే స్వంత ఇంట్లోంచి స్వంత కొడుకుల చేత వెళ్ళగొట్టబడి, కూతురి ఇంట్లో తల దాచుకుంటూ భార్యా వియోగానికి దుఃఖించాడు. భార్య పోయినప్పటి నుంచి పౌరోహిత్యం ఎలానూ మానేశారు. ఇక లోగడ తను పిల్లల్ని పెంచడానికి పడ్డ కష్టాల్నీ, ఇప్పుడు అందుకు దక్కిన ఫలితాన్ని విశ్లేషించుకుంటూ తను కుమిలిపోవడం. ఆత్మీయులెవరన్నా కనబడితే చెప్పుకు నేడవడం.

ఈ మధ్యన ఆయన దుఃఖానికి మరో కారణం కూడా తోడైందట. రెండో కొడుకుస్థలంలో ఆలనా, పాలనా లేక పిచ్చి మొక్కలు మొలిచి అడవిలా తయారైతే, అక్కడ ఇల్లన్నా కట్టి అద్దెకివ్వు, లేకుంటే అమ్మేసుకో అని పెద్దకొడుకు తరపు నుంచి హెచ్చరిక.

ఇక పెద్ద కొడుకు విషయాని కొస్తే ఎదిగొచ్చిన నలుగు రాడపిల్లలకీ ఒకేసారి పెళ్ళి చేయలేక ఇల్లమ్మేసి పెళ్ళి చేస్తే ఎలా ఉంటుం దన్న ఆలోచనలో ఉన్నాడట.

సూర్యనారాయణగారు పావలా దక్షిణకీ, అర్ధణా దక్షిణకీ, సంభావనకీ , తలొగ్గి కష్టపడి సాధించుకున్న ఇల్లు చివరికి తను ఉండకపోగా; తన కళ్ళ ముందే కొడుకులు చెరో కారణం చెప్పి అమ్మబోవడం, తన స్వార్జిత న్ని తన కళ్ళ ముందే నామరూపా ల్లేకుండా చేయడం - బ్రతికుండీ చచ్చినట్టుగా పడుండటం - ఇవన్నీ ఆయన్ని కుళ్ళబొడుస్తున్న విషయాలు.

ఇవన్నీ ఆయన బయటపడి నాతో చెప్పుకోలేక మొహమాట పడ్డ విషయాలు. అవి నాలోనూ తగినంత ఆందోళనను రేపబట్టే నే నిప్పు డిలా అర్ధరాత్రి ఆకాశంలోకి వెర్రిగా చూస్తూ పడుకున్నాను.

రెండు తరాల క్రిందటే పుట్టి పెరిగిన వాళ్ళు తండ్రిని నిరాదరణగా చూస్తూ, స్వంత ఇల్లు లేకుండా చేస్తే. ఇవాళ నేను మళ్ళీ ఏవేవో కొత్త ఆశలతో ఇల్లు కట్టుకున్నాను - మరి నా గతేమిటి?

ప్రతి మనిషీ స్వంత ఇ ల్లెందుకు కోరుకుంటాడూ? అద్దె కొంపలో పోతే బయట కీడ్చిపారేస్తారేమో నని. అటువంటిది చివరి రోజుల్లో ఇంటి నుంచి వేరు చేసి, కంటి కెదురుగా నామరూపా ల్లేకుండా చేస్తే ఏ తండ్రి హృదయం క్షోభించదూ?

మా అమ్మగారి కీ విషయా లన్నీ ఎలా చెప్పేదీ?

నేనూ తల మునకలుగా అప్పు చేసి ఇల్లు కట్టాను. జీవితంలో మిగిలిన సగం దాని రిపేర్లకీ, సున్నాలూ, రంగులకీ, ఆ లోన్ల కటింగులకీ, వడ్డీలకే సరిపోయినా నడ్డి విరిగి కూలబడేసరికి రేపు నా గతీ ఇంతేనా?

పూర్వంకన్నా పిల్లల్ని ఈ రోజుల్లో పెంచడం మరీ ఘోరం? ఈ డొనేషన్లూ, ఈ కాన్వెంట్లూ, ఈ యూనిఫారాలూ, ఈ ట్యూషన్లూ - ఇ వేమో పూర్వం ఇంత భయంకరంగా లేవు.

పిల్లల మీద ఇంత ఖర్చుపెట్టీ, ఇంటి మీద మ రెంత ఖర్చుపెట్టీ నావంటి వాడు విశ్రాంతిగా సొంత కప్పు కింద ఈజీ చైర్లో వాలి 'హమ్మయ్య' అని అనుకునే దెప్పుడు? ఎప్పుడు?

ఎప్పుడు నిద్ర పట్టిందో, ఏమో తెలియదు.

మర్నాటి నుంచి మాత్రం నా మనసేమీ బాగాలేదు. ఇల్లు కట్టిన ఉత్సాహం, గృహ ప్రవేశం చేయబోతున్నా నన్న ఆనందం ఏ కోశానా లేవు.

ఆ రోజున పిలచినవారూ, పిలవని వారూ అందరూ రాగా గృహ ప్రవేశం పీటల మీద కూర్చున్నా నేను అన్యమనస్కంగానే ఉన్నాను.

పురోహితుడు క్రతువు మొదలుపెట్టి "ఉత్తిష్టంతు భూతపిశాచాః ఏతే భూమి భారకాః" అని అక్షింత లిచ్చి వెనక్కి వేసుకోమంటే, "ఉత్తిష్టంతు భూత పిశాచాః ఏతే గృహ భారకాః" అని చెప్పి ఆ అక్షింతలు వెనక వేసుకోవడానికి బదులు నా నెత్తినే ఎందుకు వేసుకున్నానో నా ఒక్కడికే తెలుసు. ★



మనం మంచి నమ్మకమైన సేవకులం
తరాలు మారినా ... మన అంతరంగం మాత్రం బహు పదిలం

తెల్ల వా డొచ్చినా - నల్ల వా డొచ్చినా
సేవకులం బానిసలుగా పరిణతి చెందితే నేం
చెదరని చెరగని చరిత మనది
మనం మంచి నమ్మకమైన సేవకులం

మంచి హృదయం మనది - కల్మషమే అంటదు దానికి
మనలో మనం కొట్టుకు చస్తామే కానీ
అనం పల్లెత్తు మాట పరాయి బాబులను
లౌకికత్వం మన లక్ష్యం - లౌకితనం మాత్రం విడనాడం
బుద్ధులు పెడదారి పట్టినా - సుద్దులు మాత్రం ఒలికిస్తాం
తెలుసు మనకు మన బాధలు - వెతలు
అందుకే బహు చక్కగా మోగిస్తాం వేదాంత భేరి
అంతవరకే మన పని - కడముపాలు 'ఖర్మ' సిద్ధాంతం ఉండనే ఉందాయె
మనం మంచి నమ్మకమైన సేవకులం.

గీతలు చదువుతాం - పురాణాలు విప్పుతాం
మన రాతలు మాత్రం మన చేతుల్లో లే వంటాం
చావు పుట్టుకలు భగవంతుని పాలు - బ్రతుకు కర్మపాలు - భలే విచిత్రం
మిగలదా మరి బూడిద మన పాలు
మహత్తరమైన చరిత మన కుంది
బృహత్తరమైన కరువు మిగిలింది.

స్వయం కృషికి కొ త్తర్థాలు నిర్వచిద్దాం
అడుక్కు తినటమే అలవాటుగా మార్చుకుందాం
ఏర్రైతే నేం గోదారి - గోదాలోకి దిగిం తర్వాత సిగ్గేది
మనవంతు కర్తవ్యం మనం చేద్దాం - పైన
దేవుడిదే పెను భారం - మిగిలే
భూమాతకు మాత్రం జన భారం ...
మనం మాత్రం నమ్మకమైన సేవకులం!

- ఎన్వీకే